WANTED REPORTERS
నవతరం తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ కావాలన్న కోరిక ఉందా...
ఐతే నవతరం మీ కోసం
అద్భుతమైన అవకాశం కల్పిస్తుంది.
వివరాలకు : 9618907705
navataramteugudaily@gmail.com

# నవతరం

హైదరాబాద్ సంపుటి : 9 సంచిక : 218 గురువారం, ఆగస్టు 06, 2026, పేజీలు - 4 వెల: 5/-

# "జగన్ ప్రజాదరణ తట్టుకోలేకే అక్రమ కేసులు"

- పోలీసులను రాజకీయాలకు వాడటం ప్రజాస్వామ్యానికి ప్రమాదం
- ధర్మాన ప్రసాదరావు చింతాడ రవికుమార్ కుటుంబానికి అండగా ఉంటాం - ధర్మాన కృష్ణదాస్





**ఆముదాలవలస / శ్రీకాకుళం**
మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి శ్రీకాకుళం జిల్లా పర్యటన సందర్భంగా భారీగా తరలివచ్చిన ప్రజలను సాకుగా చూపి ఆముదాలవలస నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ సహా 20 మంది నాయకులపై అక్రమ కేసులు నమోదు చేసిన నేపథ్యంలో, రవికుమార్ కుటుంబ సభ్యులను మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, జిల్లా పార్టీ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ బుధవారం పరామర్శించారు. ఆమదాలవలస మండలం రావికంటిపేట గ్రామంలోని చింతాడ రవికుమార్ నివాసానికి వెళ్లి ఆయన తల్లి చింతాడ శ్యామలమ్మ, తమ్ముడు చింతాడ కృష్ణను కలిసి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ధర్మాన ప్రసాదరావు మీడియాతో మాట్లాడారు. జగన్‌కు ప్రజలు స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున తరలివచ్చారని తెలిపారు. వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబంపై ప్రజలకు ఉన్న అభిమానంతో పాటు, ముఖ్యమంత్రిగా ఐదేళ్ల పాలనలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన నాయకుడిగా జగన్‌కు ప్రజలు అపూర్వ ఆదరణ చూపారని పేర్కొన్నారు. ఈ జనసమీకరణ పార్టీ చేసింది కాదని, విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వరకు వేలాది మంది ప్రజలు స్వచ్ఛందంగా రోడ్లపైకి వచ్చి అభిమానం చాటుకున్నారని చెప్పారు. ఒకేచోట భారీగా జనసమీకరణ జరగకుండా ఉండేందుకు పార్టీ నాయకత్వం ముందుగానే కార్యకర్తలకు, అభిమానులకు తమ తమ ప్రాంతాల్లోనే నాయకుడిని కలవాలని సూచించిందన్నారు. అయినప్పటికీ ప్రజలు కొత్త రోడ్డు ప్రాంతంలో చేరి అభిమానం వ్యక్తం చేశారని తెలిపారు. ఈ ఘటనను సాకుగా చూపుతూ చింతాడ రవితో పాటు సుమారు 20 మంది నాయకులపై అనేక సెక్షన్ల కింద కేసులు నమోదు చేయడం పూర్తిగా రాజకీయ కక్షసాధింపేనని ధర్మాన ఆరోపించారు. ఈ కేసులు పోలీసుల స్వతంత్ర నిర్ణయం కాదని, రాష్ట్ర ప్రభుత్వంలోని ఉన్నత స్థాయి నుంచి వచ్చిన ఆదేశాల మేరకే నమోదు చేశారని విమర్శించారు. విధుల్లో ఉన్న పోలీసులే అక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటన జరగలేదని చెబుతున్నారని, అయినప్పటికీ ప్రజల అభిమానాన్ని అణచివేయడానికి కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. శ్రీకాకుళం, రణస్థలం, ఆముదాలవలస ప్రాంతాల్లో జరిగిన చర్యలు ప్రభుత్వం ప్రజల్లో ఆదరణ కోల్పోతున్నదనే భయానికి నిదర్శనమని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారనే భావన రాష్ట్రంలో బలపడుతోందని, అందుకే ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని ధర్మాన పేర్కొన్నారు. ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొనే బదులు పోలీసు వ్యవస్థను ఉపయోగించి కేసులు పెట్టించడం ద్వారా ప్రతిపక్షాన్ని అణచివేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో కేసులు పెట్టడం, జైళ్లకు పంపించడం ద్వారా ప్రజల అభిమానాన్ని తగ్గించలేరని, అలాంటి చర్యలు బాధితుల పట్ల ప్రజల్లో మరింత సానుభూతి పెంచుతాయని అన్నారు. పోలీసు అధికారులను రాజకీయ ఒత్తిళ్లకు గురిచేయడం సరికాదని, చట్టాన్ని నిష్పక్షపాతంగా అమలు చేయాల్సిన బాధ్యత వారిపై ఉందని అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పోలీసు శాఖతో ఎలాంటి విభేదాలు లేవని, తమ పోరాటం ప్రజలను మోసం చేశారని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ విధానాలపైనే తప్ప అధికారులపై కాదని స్పష్టం చేశారు. ప్రభుత్వాలు శాశ్వతం కావని, ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన ప్రభుత్వం ఎక్కువకాలం కొనసాగదని అన్నారు. "గుండెపై చేయి వేసుకుని చెప్పండి... అక్కడ హత్యాయత్నం జరిగిందా? అక్కడున్న అధికారులే ఎలాంటి అవాంఛనీయ ఘటన జరగలేదని చెబుతున్నారు. వేలాది మంది స్వచ్ఛందంగా రోడ్లపైకి రావడం ప్రభుత్వానికి ఒక హెచ్చరిక. ప్రజలు ఎందుకు వస్తున్నారో ప్రభుత్వం ఆత్మపరిశీలన చేసుకోవాలి" అని ధర్మాన ప్రసాదరావు అన్నారు. పార్టీ నాయకులను జైళ్లకు పంపించి భయపెట్టాలనే ప్రయత్నాలు ఫలించవని, అలాంటి చర్యల వల్ల ఉద్యమం మరింత బలపడుతుందని హెచ్చరించారు. కేసులు ఎదుర్కొంటున్న పార్టీ నాయకులు, కార్యకర్తలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ పూర్తిస్థాయిలో న్యాయ సహాయం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగా వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తూ వేధింపులకు గురిచేస్తోందని మండిపడ్డారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న చింతాడ రవికుమార్‌ను రాజకీయంగా దెబ్బతీసేందుకే ఈ తరహా కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని, చట్టపరమైన పోరాటం ద్వారా అక్రమ కేసులను తిప్పికొడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, టెక్కలి సమన్వయకర్త పేరాడ తిలక్, ఇచ్ఛాపురం సమన్వయకర్త శ్యాం ప్రసాద్ రెడ్డి, వైఎస్సార్సీపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు, జిల్లా ఉపాధ్యక్షులు పైల చిట్టిబాబు, వైఎస్సార్సీపి పలాస పట్టణ అధ్యక్షులు శిష్టు గోపి, వైఎస్సార్సీ నేతలు పాలిన శ్రీనివాస్ యాదవ్, పలాస మాజీ ఎంపీపీ బత్తిన హేమేశ్వర రావు, కె. గోపి, దువ్వాడ రవి తదితరులు పాల్గొన్నారు.

# "ఒకే చట్టం - ఒకే న్యాయం" కోసం యువత మేల్కొనాలి - శిరిగిరి వరదరాజు

- కులం-మతం కుమ్ములాటలు వద్దు - సమాజం అధోగతికి వెళ్తోంది
- ప్రభుత్వ రంగమే శాశ్వత పరిష్కారం - ఆరోగ్యం, విద్య ప్రభుత్వానివే కావాలి
- భజన కాదు ప్రశ్నించాలి - వైఫల్యాలను పాలకులకు చెప్పడం బాధ్యత
- నిరుద్యోగం, అభివృద్ధి కోసం గాంధీ మార్గంలో పోరాటం
- "పాలకులకు మన-తన భేదం ఉండకూడదు" - శిరిగిరి వరదరాజు



**కోటబొమ్మలి:**
రాష్ట్ర అభివృద్ధి, నిరుద్యోగ సమస్య పరిష్కారం, సామాజిక న్యాయం కోసం విద్యావంతులు, యువత, నిరుద్యోగులు మేల్కొని "ఒకే చట్టం - ఒకే న్యాయం" నినాదంతో ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని నవ చైతన్య యువజన సేవా సమితి వ్యవస్థాపక చైర్మన్ శిరిగిరి వరదరాజు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన కోటబొమ్మలిలో ప్రకటన విడుదల చేస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు."ఇది భజన చేసే సమయం కాదు, ప్రశ్నించే సమయం. ప్రజాస్వామ్యబద్ధంగా, గాంధీ మార్గంలో మన సమస్యలను ప్రభుత్వాలకు తెలియజేయాలి" అని ఆయన అన్నారు. కులం, మతం పేరుతో జరుగుతున్న అంతర్గత కుమ్ములాటలపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "కులం పేరుతో కొట్టుకుంటే లాభపడేది ఎవరు? ఇలాంటి కుమ్ములాటలు సమాజాన్ని మరింత అధోపాతాళానికి నెడతాయి" అని పేర్కొన్నారు. శాశ్వత ప్రయోజనాల కోసం ఆరోగ్యం, విద్య, వైద్యరంగం, రహదారులు, పోర్టులు వంటి అత్యవసర వ్యవస్థలు ప్రభుత్వ రంగంలోనే పూర్తిస్థాయిలో కొనసాగాలని ఆయన డిమాండ్ చేశారు. "ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేయకుండా అభివృద్ధి సాధ్యమేనా? ప్రైవేటుకు అప్పజెప్తే పేదవాడి గతి ఏంటి?" అని ప్రశ్నించారు. ప్రభుత్వానికి మన సమస్యలను న్యాయబద్ధంగా పరిష్కరించేలా ఒత్తిడి తీసుకురావడం ప్రతి పౌరుడి బాధ్యత అని చెప్పారు. రాజకీయ పార్టీల భజన, ఊడిగం చేయడం వల్ల ప్రజా సమస్యలు పరిష్కారం కావని ఆయన స్పష్టం చేశారు. "రాజకీయ పార్టీలను అభిమానించడం తప్పు కాదు. కానీ జరుగుతున్న వైఫల్యాలను, పాలన తీరును పాలకపక్షాలకు నివేదించడం మన కర్తవ్యం. ప్రజాస్వామ్య పౌరులుగా అది మన బాధ్యత" అని అన్నారు. వ్యవస్థలు రాజ్యాంగ సూత్రాలకు అనుగుణంగా పని చేయనప్పుడు, అవినీతి, బంధుప్రీతి పెరిగినప్పుడు ప్రజలు ఖచ్చితంగా స్పందించాల్సిందేనని హెచ్చరించారు. "పాలించేవారికి మన-తన అనే భేదం ఉండకూడదు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా పాలన కుల, మత, రాజకీయాలకు అతీతంగా జరగాలి" అని శిరిగిరి వరదరాజు అన్నారు. లేకపోతే ప్రజాస్వామ్య మనుగడే ప్రశ్నార్థకం అవుతుందని, ప్రజల్లో అనైక్యత పెరిగి శాంతిభద్రతలు దెబ్బతింటాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. "ఇలాంటి పరిణామాలు అభివృద్ధికి, శాంతి భద్రతలకు పెద్ద విఘాతం కలిగిస్తాయి" అని అన్నారు."ఇప్పటికైనా విద్యావంతులు, యువత, నిరుద్యోగులు, మేధావులు, స్వచ్ఛంద సేవకులు సమాజ హితం కోసం సానుకూలంగా స్పందించాలి. సమస్యలపై స్పందించి, ప్రజలకు న్యాయం జరిగేలా ప్రభుత్వాలకు నివేదిస్తారని ఆశిస్తున్నాను" అంటూ ఆయన తన ప్రకటనను ముగించారు.

# జీడిమెట్ల సర్కిల్ లో సమీక్ష సమావేశం



**కుత్బుల్లాపూర్, నవతరం:** జీడిమెట్ల సర్కల్ 55 లో బుధవారం నాడు అన్నీ డిపార్ట్మెంట్ లతో సమీక్షా సమావేశం నిర్వంచారు డిప్యూటీ కమిషనర్, జీడిమెట్ల సర్కల్ 55 కుత్బుల్లాపూర్ జోన్, సైబెరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్. ఈ సమావేశమలో ముఖ్యముగా వర్షాల వలన పాడైన రోడ్ల గురించి, డ్రైనేజ్ గురించి ఒన్ డే ఒన్ వార్డ్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు ఇచ్చిన పిర్యాదుల గురించి చర్చించారు. ఈ సమావేశంలో జీడిమెట్ల సర్కల్ హెచ్వోడీ లు, వాటర్ వర్క్స్, ఎలెక్ట్రికల్ డిపార్ట్మెంట్ వారు హాజరు అయ్యారు.

# బీసీల సంక్షేమానికి మరింత బలమైన చట్టం దిశగా అడుగులు

- బీసీ ప్రజాప్రతినిధులతో మంత్రి సవిత కీలక సమావేశం..
- బీసీ చట్ట ముసాయిదాపై మంత్రి అచ్చెన్నాయుడు సూచనలు







**అమరావతి, ఆగస్టు 5:** రాష్ట్రంలో బీసీల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, సామాజిక న్యాయానికి మరింత బలమైన చట్టాన్ని తీసుకురావాలనే లక్ష్యంతో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అధ్యక్షతన బీసీ ప్రజాప్రతినిధులతో విజయవాడలోని ఫార్చ్యూన్ మురళి హోటల్లో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పాల్గొని బీసీ చట్ట ముసాయిదాపై పలు విలువైన సూచనలు చేశారు. బీసీ వర్గాల ఆకాంక్షలకు అనుగుణంగా చట్టాన్ని మరింత సమగ్రంగా, పారదర్శకంగా రూపొందించేందు కు ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు, సూచనలను సమావేశంలో విస్తృతంగా చర్చించారు. చట్టం ద్వారా బీసీలకు మరింత రక్షణ, అభివృద్ధి అవకాశాలు కల్పించే అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, బీసీల సామాజిక, ఆర్థిక, విద్యా అభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. బీసీ వర్గాల సంక్షేమం కోసం తీసుకువస్తున్న చట్టం ఆదర్శవంతంగా ఉండేలా ప్రభుత్వం అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటోందని తెలిపారు. బీసీల సాధికారతకు ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, వారి హక్కులను మరింత బలోపేతం చేసేలా చట్టానికి తుది రూపు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

# బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ను మర్యాద పూర్వకంగా కలిసిన మాణిక్య నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు



**కుత్బుల్లాపూర్, నవతరం:** కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద 131 - కుత్బుల్లాపూర్ డివిజన్ మాణిక్య నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా 5వ సారి ఏకగ్రీవంగా ఎన్నికైన బి.మహేష్, బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ను కమిటీ సభ్యులు, కాలనీ వాసులతో కలిసి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, పాల్గొన్నారు.


# మాజీ ఎమ్మెల్యేను కలిసిన కాలనీ ప్రజలు






**కుత్బుల్లాపూర్, నవతరం:** మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ను జీడిమెట్ల డివిజన్ పరిధిలోని హెచ్ఏఎల్ రాఘవేంద్ర కాలనీ వాసులు కలిసి, కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కాలనీ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన అభివృద్ధి పనులు ప్రారంభించాలని కోరారు. శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా ఉషోదయ కాలనీ సంక్షేమ సంఘం ( వెల్ఫేర్ అసోసియేషన్) సభ్యులు కాలనీలోని పలు సమస్యలపై మర్యాదపూర్వకంగా కలిసి పరిష్కరించాలని కోరారు. అనంతరం పలువురు తమ కుటుంబ శుభకార్యాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఆయనకు అందజేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే చేతుల మీదుగా "నిహారా కలెక్షన్" ఘన ప్రారంభం



**కుత్బుల్లాపూర్, నవతరం:** 131- కుత్బుల్లాపూర్ డివిజన్ సంజీవయ్య నగర్ చౌరస్తా లో నూతనంగా ఏర్పాటుచేసిన "నిహారా కలెక్షన్" ను బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి సత్తి రెడ్డి, సీనియర్ నాయకులు కిషోర్ చారి, దూదిమెట్ల క్రిష్ణ యాదవ్, నసీరుద్దీన్, రమణా రెడ్డి, కళ్లెం శ్రీనివాస్, అజయ్, వెంకటేష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా పనిచేసే నాయకులు ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్





**కుత్బుల్లాపూర్, నవతరం:** అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు మెరుగైన వైద్యాన్ని అందించాలనే లక్ష్యంతో కుత్బుల్లాపూర్ బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ సూరారం డివిజన్ కు చెందిన ఇద్దరు నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరు చేయించిన ఎల్ఓసీ పత్రాలను బుధవారం నాడు చింతల్ లోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో దరఖాస్తుదార కుటుంబసభ్యులకు అందజేశారు. ఎల్వోసీ మంజూరు లబ్దిదారుల వివరాలు:129 - జీడిమెట్ల డివిజన్ సంజయ్ గాంధీ నగర్ కు చెందిన రాజేంద్రన్ దివ్యాన తండ్రి శ్రీధరన్ రాజేంద్రన్ (రూ.2,75,000/- లక్షలు).. 129 - జీడిమెట్ల డివిజన్ విశ్వకర్మ కాలనీ అశోక్ కుమార్ పండిత్ తండ్రి సీతారామ్ పండిత్ (రూ.3,50,000/- లక్షలు)..ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, సీనియర్ నాయకులు కొండకల్లా శ్రీనివాస్ రెడ్డి, జీవన్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, జీవన్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, యశ్వంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 22ఏ భూముల పేరిట ఒక్క అర్హుడికీ అన్యాయం జరగదు

- కొత్తగా ఒక్క సెంటు భూమిని కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదు
- ప్రభుత్వ ఆలోచనను అర్థం చేసుకొని అదే స్ఫూర్తితో పనిచేయాలి
- అర్హులైన వారి హక్కులను కాపాడుతూనే ప్రభుత్వ భూములను పరిరక్షించాలి
- 22ఏ దరఖాస్తులు, ఫిర్యాదులను నిర్ణీత గడువులోనే పరిష్కరించాలి
- రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టమైన ఆదేశాలు





**హైదరాబాద్, నవతరం:** రాష్ట్రంలో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల విషయంలో ఏ పేదవాడికీ, ఏ నిజమైన భూహక్కుదారుడికీ అన్యాయం జరగకుండా చూడటమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార ఒ పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. అర్హులైన వారి హక్కులను కాపాడటం, అదే సమయంలో ప్రభుత్వ భూములను రక్షించడం అనే రెండు లక్ష్యాలతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్దేశపూర్వకంగా ఒక్క సెంటు భూమిని కూడా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చలేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేయాలనే ఉద్దేశం ఈ ప్రభుత్వానికి ఎన్నడూ లేదని, వివాదాలు లేని ప్రైవేట్ భూములను నిషేధిత జాబితాలో చేర్చిందన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు.బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని తన కార్యాలయంలో క్యూర్ పరిధిలోని 22ఏ నిషేధిత భూములకు సంబంధించి వివిధ మాధ్యమాల్లో వచ్చిన కథనాలు, ప్రజల ఫిర్యాదులు, హైకోర్టు ఆదేశాలు, ప్రభుత్వ విధానాలపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి శేషాద్రి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, స్టాంప్స్ ఒ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, మేడ్చల్--మల్కాజిగిరి అదనపు కలెక్టర్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఈ సమావేశం క్యూర్ పరిధి జిల్లాలకు సంబంధించినదైనా, ఇందులో ఇచ్చిన ఆదేశాలు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, స్టాంప్స్ ఒ రిజిస్ట్రేషన్ అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు.ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా పనిచేయాలి. 22ఏ అంశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలు, సూచనలు అనుగుణంగా ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని అధికారులు పూర్తిగా అర్థం చేసుకుని అదే స్ఫూర్తితో పనిచేయాలని ఆదేశించారు. అర్హులైన వ్యక్తికి న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత. అదే సమయంలో ప్రభుత్వ భూములు కాపాడటం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత అని అన్నారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములను సమగ్రంగా పరిశీలించి, చట్టబద్ధంగా, నిబంధనల మేరకు అర్హత ఉన్న భూములను గుర్తిస్తూ, ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కేసును వాస్తవాలు, రికార్డులు, చట్టపరమైన అంశాల ఆధారంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించారు.22ఏకు సంబంధించిన దరఖాస్తులు, ఫిర్యాదులు ఏ స్థాయిలో వచ్చినా పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని మంత్రి స్పష్టం చేశారు. తహసీల్దార్, ఆర్డీవో, సబ్ కలెక్టర్, జిల్లా కలెక్టర్ స్థాయిలో వచ్చే ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి అర్హులైన వారికి న్యాయం చేయాలని సూచించారు. ప్రజావాణిలో ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను కూడా ప్రత్యేక దృష్టి సారించి, వెంటనే విచారణ పూర్తి చేసి విధిగా పరిష్కరించాలని ఆదేశించారు.22ఏ భూములకు సంబంధించిన వివాదాల పరిష్కారానికి హైకోర్టు నిర్దేశించిన 45 రోజుల గడువులోనే అన్ని ప్రక్రియలు పూర్తి చేసి తుది నిర్ణయం తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. 22ఏ కు సంబంధించిన కేసులలో కోర్టు ఆదేశాలను పరిగణనలోకి తీసుకొని పరిష్కరించాలని ప్రజలకు న్యాయం జరిగేలా వ్యవహరించాలని సూచించారు.ప్రభుత్వ భూములను పరిరక్షించడం ప్రభుత్వ ప్రథమ బాధ్యత అని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములపై అక్రమ లావాదేవీలు, అక్రమ రిజిస్ట్రేషన్లు, ఆక్రమణలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. 22ఏ జాబితాలో ఉన్న భూములపై సమగ్ర పరిశీలన చేసి తుది నిర్ణయం తీసుకునే అధికారం జిల్లా కలెక్టర్లకు ఉందని గుర్తుచేస్తూ, ప్రజల హక్కులు -- ప్రభుత్వ ప్రయోజనాలు రెండింటినీ సమతుల్యం చేస్తూ పారదర్శకంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ లో పాల్గొన్న కూన శ్రీశైలం గౌడ్







**హైదరాబాద్, నవతరం:** రాయదుర్గంలో గౌడ కమ్యూనిటీ ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవంతో పాటు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్. హైదరాబాద్‌లోని రాయదుర్గంలో గౌడ కులస్తులందరూ ఐక్యంగా కలిసి నిర్మించిన నూతన ఫంక్షన్ హాల్‌ను ఘనంగా ప్రారంభించారు. అదే సందర్భంగా వీరయోధుడు శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌడ కులస్తులందరూ ఐకమత్యంతో ముందుకు సాగి, సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. వివిధ రంగాల్లో స్థిరపడిన గౌడ కులానికి చెందిన ప్రముఖులు తమ వంతు సహకారం అందించి యువతను ప్రోత్సహించాలని సూచించారు. రాజకీయ, సామాజిక, విద్య, వ్యాపార తదితర అన్ని రంగాల్లో గౌడ కులస్తులు మరింత ముందుకు వచ్చి రాణించాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే ఇంతటి గొప్ప ఫంక్షన్ హాల్‌ను సమిష్టి కృషితో నిర్మించిన రాయదుర్గం గౌడ కులస్తులందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కి గౌడ్ గౌడ కుల పెద్దలు పల్లె లక్ష్మణ్ గౌడ్, జగదీశ్వర్ గౌడ్, నేమూరి రాములు గౌడ్, తదితర ప్రముఖులతో పాటు స్థానిక గౌడ కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రాంరెడ్డి నగర్లో భారీ అక్రమ నిర్మాణం


- క్షేత్రస్థాయి పర్యవేక్షణలో విఫలమౌతున్న కొంపల్లి సర్కిల్ అధికారులు
- ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్న అక్రమ నిర్మాణదారులు
- అసలే కమర్షియల్, అందులోనూ అనుమతులు నిల్
- ఆన్లైన్ ఫిర్యాదులకూ స్పందించని అవినీతి టౌన్ ప్లానింగ్ యంత్రాంగం
- ప్లాట్ నంబర్ 899 లో యదేచ్ఛగా కొనసాగుతున్నా చర్యలు శూన్యం
- నోటీసులతో పబ్బం గడుపుకుంటున్న కొంపల్లి టౌన్ ప్లానింగ్ విభాగం
- చర్యలు తీసుకోవడంలో విఫలమౌతున్న స్థానిక డిప్యూటీ కమిషనర్














**కుత్బుల్లాపూర్, నవతరం:** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, కొంపల్లి సర్కిల్ పరిధిలోని ఇండస్ట్రియల్ ఏరియా అయినటువంటి రాంరెడ్డి నగర్ లో టీజీ బీపాస్ చట్టానికి విరుద్ధంగా ప్లాట్. 899 లో నిర్మాణదారుడు యదేచ్ఛగా అక్రమ నిర్మాణపనులు కొనసాగిస్తున్నాడు. ఈ నిర్మాణానికి సంబందించి వార్తా పత్రికల్లో కథనాలు ప్రచురితమైనా చర్యలు మాత్రం నోటీసులకే పరిమితమయ్యాయి. మై క్యూర్ ద్వారా ఆన్లైన్ ఫిర్యాదులు అందినా కూడా కేవలం ఆన్లైన్ ఫిర్యాదులు క్లోస్ చేస్తున్నారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. సుభాష్ నగర్, రాంరెడ్డి నగర్ లో వెలుస్తున్న మరిన్ని బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణాలు, కమర్షియల్ షెడ్లు, నాలా ఆక్రమణలు.. వీటిపై వార్తలు వస్తున్నా స్థానిక టౌన్ ప్లానింగ్ అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదంటే ఇక్కడి అవినీతి ఎంతలా ఉందో ఇట్టే అర్థమౌతుందనటున్నారు స్థానిక ప్రజలు. ఫాక్స్ సాగర్ నాలా ఆక్రమణ, కమర్షియల్ షెడ్ల నిర్మాణాలపై వరుస కథనాలు 'నవతరం' తెలుగు దినపత్రిక ప్రచురిస్తూనే వస్తుంది. ఇకనైనా స్థానిక నోడల్ అధికారి, కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ స్పందించి రాంరెడ్డి నగర్, సుభాష్ నగర్ లో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఇక్కడి జనం కోరుకుంటున్నారు.



# డూప్లికేట్ పట్టాలతో ఇండ్ల నిర్మాణాలు!

- ఒక్క పట్టా ఉంటే చాలు ఎన్నయినా నిర్మించవచ్చు
- ఫిర్యాదులు వస్తే తప్ప చర్యలు తీసుకోరు
- అసలు ఏది.. నకిలీ ఏది.. వెరిఫికేషన్ చేస్తే తప్పేంటి
- సందట్లో సడేమియా లాగా కబ్జాదారుల బరితెగింపు



పెద్ద మసీదు కంటే ముందు గల్లీలో గుట్టు చప్పుడు కాకుండా వెలిసిన అక్రమ నిర్మాణం



మదర్సా దాటిన తర్వాత నిర్మాణం





కమిటీ హాల్ కు దగ్గరలో... కొత్త ఇంటికి పాత పట్టా (వెరిఫికేషన్ చేయాల్సిన పట్టా) నిర్మాణం







సగం కూల్చివేతలు - గాగిల్లాపూర్ కబ్జాదారులకు వరం

**దుండిగల్, నవతరం:** మేడ్చల్ జిల్లా దుండిగల్ మండల పరిధిలోని చర్చి గాగిళ్ళపూర్ సర్వే నంబర్ 214 లోని ప్రభుత్వ భూములు హారతి కర్పూరంలా కరిగి పోతున్నాయి. రాత్రిళ్ళు, పగలు అని తేడా లేకుండా అందినకాడికి దండుకుంటూ.. అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు ఇక్కడి నిర్మాణదారులు. ఇంత జరుగుతున్నా.. కనీసం అటువైపు కన్నెత్తి చూడారు స్థానిక జీపీవో. ఒకవేళ ఫిర్యాదులు వస్తే, కేవలం నోటిమాట తో వార్నింగ్ చేస్తారు తప్ప.. సదరు అక్రమ ఇంటి నిర్మాణం ఎవరు చేశారు. అందుకు రెవెన్యూ, మున్సిపల్ నుండి ఏమైనా అనుమతులు తీసుకున్నారా.. లేదా? అనే విషయం కనీసం విచారణ చేయకపోవటం ఇక్కడి అధికారుల విజ్ఞతకే వదిలేద్దాం. అందుకు కొన్ని ఉదాహరణాలున్నాయి, చర్చి గాగిళ్ళపూర్ లోని పెద్ద మసీదు కంటే ముందు గల్లీలో నిర్మించిన అక్రమ నిర్మాణం, మదర్సా దాటిన తర్వాత వెలిసిన పాత ఇంటికి కొత్త కల, కమిటీ హాల్ కు అతి దగ్గరలో తమకు పట్టా ఉంది అంటూ (ఒకవేళ డూప్లికేట్ అయివుంటే) నిర్మించిన పూర్తి ఇంటి నిర్మాణం, బేకరీ గల్లీలో సగంలో ఆగిన షెడ్డు నిర్మాణం.. అప్పుడప్పుడు ఫిర్యాదులకు స్పందిస్తున్న నిఖాసయిన రెవెన్యూ అధికారులు ఇప్పుడు కూడా స్పందించి డూప్లికేట్ పట్టాల వ్యవహారం బట్టబయలు చేసి తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## బండి సంజయ్ ను కలిసిన టీబీజేపీ నాయకులు



**న్యూ ఢిల్లీ, హైదరాబాద్, నవతరం:** ఢిల్లీలోని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అధికారిక నివాసంలో మధ్యాహ్న విందులో రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్, మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమకాలీన రాజకీయ అంశాలు, రాష్ట్రంలో పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలు మరియు భవిష్యత్ కార్యాచరణపై పరస్పరం చర్చించారు.

## నర్సారెడ్డి భూపతిరెడ్డిని ఆహ్వానించిన దరువు అంజన్న



**కుత్బుల్లాపూర్, నవతరం:** తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలంగాణ కలాల గళాల వేదిక ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నిర్వహిస్తున్న తెలంగాణ కళాకారుల బోనాల జాతర కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి ని తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ సభ్యులు దరువు అంజన్న, కమిటీ సభ్యులు ఆహ్వానించారు.

## విగ్రహావిష్కరణ లో పాల్గొన్న రవికుమార్ యాదవ్



**హైదరాబాద్, నవతరం:** గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని రాయదుర్గం సాయి నగర్ కాలనీలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన గౌడ సంఘం భవనం ప్రారంభోత్సవం, అలాగే సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో మాజీ పార్లమెంట్ సభ్యులు, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షులు బూర నర్సయ్య గౌడ్ తో కలిసి పాల్గొన్నారు శేరిలింగంపల్లి బీజేపీ నాయకులు రవికుమార్ యాదవ్.

## శుభకార్యాలకు ఆహ్వానించిన కాంగ్రెస్ నాయకులు







**కుత్బుల్లాపూర్, నవతరం:** బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కొలన్ హన్మంత్ రెడ్డిని కలిసి శుభకార్యాలకు ఆహ్వానించారు కాంగ్రెస్ నాయకులు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో, పలు శుభకార్యాలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి ఆహ్వానించారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి వారి ఆహ్వానాన్ని స్వీకరించి, శుభకార్యాలు విజయవంతంగా జరగాలని ఆకాంక్షిస్తూ తన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వన్ డే వన్ వార్డ్ కార్యక్రమంలో పాల్గొన్న గుమస్తా మధుసూదన్





**కుత్బుల్లాపూర్, నవతరం:** వన్ డే వన్ వార్డ్ కార్యక్రమం లో భాగంగా బుధవారం నాడు 279 రోడ మేస్త్రి నగర్ డివిజన్ లో సమావేశం ఏర్పాటు చేసి, స్థానికంగా ఉండే సమస్యలను అడిగి తెలుసుకున్నారు సీఎంసీ కమిషనర్ సృజన, కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు గుమస్తా మధుసూదన్ పాల్గొని రోడమేస్త్రి నగర్ డివిజన్ లో నెలకొన్న డ్రైనేజీ, రోడ్లు, స్ట్రీట్ లైట్స్ సమస్యలను పరిష్కరించాలని పెండింగ్ లో ఉన్న పనులు త్వరగా పూర్తి అయ్యేలా చూడాలని కోరారు. ప్రధానంగా శ్రీనివాస్ నగర్ లో ఉన్న స్మశాన వాటిక గురించి తెలియజేస్తూ అక్కడ ఉన్న సమస్యల గురుంచి చెప్పారు. అలాగే అక్కడికి వచ్చే వారికీ ఇబ్బంది కలగకుండా వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అల్ పార్టీల నాయకులు, కార్యకర్తలు, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు, జనరల్ సెక్రెటరీలు, వివిధ బస్తీ ప్రజలు పాల్గొని పలు సమస్యల గురించి సిఎంసి కమిషనర్ సృజన కు తెలియజేశారు.

## ఆగస్టు 10న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి: సంయుక్త కిసాన్ మోర్చా




**వరంగల్, ఆగస్టు 5** క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న నిర్వహించే జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా (రాఖవీ) నాయకులు పిలుపునిచ్చారు. శివనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా సమావేశంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వరంగల్‌లో తహసీల్దార్ కార్యాలయం, నర్సంపేటలో ఆర్డీవో కార్యాలయం ముట్టడి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కనీస మద్దతు ధరలకు చట్టబద్ధ హామీ, రుణ విమోచన చట్టం, విద్యుత్ సవరణ బిల్లు ఉపసంహరణ, రైతులకు ప్రయోజనం చేకూరేలా పంటల బీమా పథకం అమలు తదితర డిమాండ్ల సాధన కోసం రైతులు, కార్మికులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## 'హర్ ఘర్ తిరంగా' అభియాన్‌ను విజయవంతం చేయాలి: రావు పద్మారెడ్డి




**హనుమకొండ, ఆగస్టు 5** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు చేపడుతున్న "హర్ ఘర్ తిరంగా" అభియాన్‌ను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకురాలు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కాంటెస్టెడ్ అభ్యర్థి రావు పద్మారెడ్డి పిలుపునిచ్చారు. బీజేపీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తిని చాటాలని, కార్యకర్తలు ప్రతి ఇంటికి చేరుకుని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో మాజీ మేయర్ డా. టి. రాజేశ్వర్ రావు, పులి సర్వోత్తమ్ రెడ్డి, దేవనూరి మేఘనాథ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


## స్ఫూర్తి కార్యక్రమంలో విద్యార్థినులకు కలెక్టర్ సత్య శారద మోటివేషన్



**వర్ధన్నపేట, ఆగస్టు 5 :** జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో నిర్వహిస్తున్న 'స్ఫూర్తి' కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బుధవారం వర్ధన్నపేట గిరిజన బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడిన కలెక్టర్, విద్యతో పాటు విజ్ఞానం, వ్యక్తిత్వ వికాసం, చైతన్యం పెంపొందించుకునేలా కృషి చేయాలని సూచిస్తూ వారికి మోటివేషన్ కల్పించారు.

# దుండిగల్ సర్కిల్ లో అంతులేని అక్రమ నిర్మాణాలు

- నోటీసులతో కాలాయాపన చేస్తున్న టౌన్ ప్లానింగ్ యంత్రాంగం
- అందినకాడికి దండుకుంటూ తెరవెనుక నడిపిస్తున్న కిందిస్థాయి సిబ్బంది
- ఆన్లైన్ ఫిర్యాదులనూ పట్టించుకోని డిప్యూటీ కమిషనర్
- ఫిర్యాదులు చేసినా అక్రమ నిర్మాణాలు సక్రమం చేస్తున్న కేటుగాళ్లు




| | |
|---|---|
| ID | 1706265931019 |
| Type | Unauthorized Construction |
| Landmark | 295-Bowrampet, Dundigal, Qutbullapur |
| Mobile No | |
| Time | 17-JUN-2026 13:54:58 |
| Status | Resolved By Officer |
| Posted by | |
| Remarks | Unauthorized cellar commercial four-floor building construction in D. Pochampally, between TAAZA Hotel and NAYARA Petrol pump in Dundigal circle. The building was seized and partially demolished, but the builder has not stopped construction. Kindly take necessary legal action against the constructor/builder. Thank you. |
| Assigned to | E. SRINIVASU,ACP() •••••• 7527 |



2026 మార్చి 26న ఇలా కూల్చివేత..







5:55

Grievance Details

| | |
|---|---|
| ID | 1606265929154 |
| Type | Unauthorized Construction |
| Landmark | 295-Bowrampet, Dundigal, Qutbullapur |
| Mobile No | |
| Time | 16-JUN-2026 17:54:49 |
| Status | Open |
| Posted by | |
| Remarks | Unauthorized commercial big shed construction without permission in D. Pochampally beside Penna Cement Godown, plot no. 3-108/21, PCIL Dundigal Gandimaisamma, Opposite to Pista House, Gandimaisamma Medak Highway, Cyberabad Municipal Corporation limits. Kindly take necessary action. |
| Assigned to | E. SRINIVASU,ACP() •••••• 7527 |

Images uploaded by you









**కుత్బుల్లాపూర్ / సైబరాబాద్, నవతరం:** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, దుండిగల్ సర్కిల్ పరిధిలోని డీ. పోచంపల్లి, గండిమైసమ్మ పరిసర ప్రాంతాల్లో రోజురోజుకూ అనుమతుల్లేని బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు, సెల్లార్ అండ్ కమర్షియల్ భవన నిర్మాణాలు, భారీ షెడ్ల నిర్మాణాలు, గతంలో కూల్చివేసినా ప్రస్తుతం పూర్తి చేసిన అనుమతుల్లేని భవన నిర్మాణాలు చూస్తుంటే.. అసలు టౌన్ ప్లానింగ్ అనే ఒక యంత్రాంగం దుండిగల్ సర్కిల్ లో ఉందా అనే అనుమానాలు కలుగుతాయి. గతంలో అవినీతి కూపంలో కూరుకుపోయిన ఓ అధికారిపై ఏసీబీ అధికారులు విచారణ జరిపి సస్పెండ్ చేసినా మిగతా అవినీతి తిమింగళలాలకు కనీస భయం లేకపోవడం -- ఇక్కడి అవినీతి ఏ స్థాయిలో ఉందో అని చెప్పటానికి ఒక ఉదాహరణ. అక్రమ నిర్మాణాలకు వెన్నంటి ఉంటూ, కొందరు రాజకీయ నాయకుల చెప్పు చేతుల్లో పని చేస్తున్న స్థానిక టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యానికి కొన్ని మచ్చులు.. 1) డి. పోచంపల్లి పరిధిలోని దుండిగల్ -- మెదక్ రోడ్డులో పెన్నా సిమెంట్ గోడౌన్ (ప్లాట్. 3-108/21 పక్కన) పీసీఐఎల్ దుండిగల్ గండిమైసమ్మ -- పిస్తా హౌస్ కి ఎదురుగా వెలుస్తున్న కమర్షియల్ షెడ్డుపై మై క్యూర్ యాప్ ద్వారా ఆన్లైన్ ఫిర్యాదులు వచ్చినా ఫిర్యాదులు క్లోస్ చేస్తున్నారే తప్ప చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు, అందుకు ఫలితం నిర్మాణం పూర్తి అయింది. 2) డి. పోచంపల్లి పరిధిలోని అదే మెదక్ హై వే లో నాయారా పెట్రోల్ బంక్ పక్కన సీజ్ చేసిన పూర్తి కమర్షియల్ సెల్లార్ భవన నిర్మాణాన్ని కూల్చివేసినా నిర్మాణదారుడు మాత్రం పూర్తి చేశాడు. 3) దుండిగల్ గండిమైసమ్మ ఎక్స్ రోడ్డుకు అన్నివైపులా కమర్షియల్ బహుళ అంతస్తుల నిర్మాణాలు కొనసాగుతున్నాయి, అయినా చర్యలు మాత్రం శూన్యం. ఇలా చెప్పుకుంటూ పోతే దుండిగల్ సర్కిల్ పరిధిలోని ప్రతి గల్లీలో ఓ అక్రమ నిర్మాణం పనులు జరుగుతున్నాయి. ఇకనైనా కేవలం నోటీసులకే పరిమితం కాకుండా తీసుకుంటున్న నెలవారీ గౌరవ వేతనానికి న్యాయం చేసే దిశగా విధులు నిర్వహిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: pressmanbharat@gmail.com, Telangana State Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://navatharam.com